# నాసిగాడి గాంధీయం

కె. పరమేశ్వరీ కృష్ణమూర్తి

క్రొత్త ఊరు అని ఆ గ్రామాని కా పేరు ఎలా వచ్చిందో చెప్పలేము కాని, జమీందారుల పలుకుబడిలో ఉండటం వల్ల ఆచార వ్యవహారాల్నీ చాలామటుకు పాతవే! ఆ ఊరిలో దాదాపు నాలుగు వందల గడప ఉండేవి. ఊరికి అరమైలు దూరంలో మాలపల్లె ఉండేది. ఆ ఊరిలో చెప్పుకోతగ్గ మోతుబరి రెండు వందల ఎకరాల ఆసామి రామబ్రహ్మం గారు. కరణం రాజయ్యకు దెబ్బై ఎకరాల మాగాణి ఉంది. రామబ్రహ్మం గారు చెప్పేది రాజయ్యకు వేదం. రామబ్రహ్మం గారు చెప్పేది రాజయ్య మాటే. వారిద్దరి ఋణస్నంధాలపైనే ఆ గ్రామం నడుస్తుండేది. ఆ ఊళ్ళో వాళ్ళ ప్రభ వెలిగిపోతుండేది. వారు చెప్పింది వేదం. వాళ్ళ ప్రభ ఆ ఊళ్ళో అలా అలా వెలిగి పోతుండేది. వాళ్ళ ఇష్టాయిష్టాలపై గ్రామ పరిపాలన కొనసాగేది. ప్రజలకు ఏ విషయంలోను వారిని ఎదుర్కొనే ధైర్యం లేదు. ఖర్మం చాలక ఎవరైనా ఎదిరించినా, వారికి పచ్చి మంచినీళ్ళు దొరకవు. పుట్టగతు లుండవు.

అది 1940 వ సంవత్సరం. గాంధీ గారు దేశ పర్యటన చేస్తూ విదేశ వస్తు బహిష్కరణ, ఉప్పు సత్యాగ్రహం, హరిజనోద్ధరణ మొదలగు నినాదాలతో ప్రజలలో దేశభక్తి రేకెత్తిస్తూ బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడ లాడిస్తున్న రోజులు. ప్రజలు గాంధీ, తిలక్, నెహ్రూ మొద



లైన వారి ఉద్యోగులవంటి ప్రభావితులై ప్రజల్ని కూడా రెచ్చగొట్టి పోరాటం చేస్తున్నారు. కాని, కొత్త ఊరులో స్వాతంత్ర్యోద్యమపు ఛాయలు చాలా బలహీనంగా ఉండేవి.

ఇలా ఉండగా ఒక నాడు ఒక సన్నకారు రైతు రంగయ్య భార్య సుభద్రమ్మగారు ఖద్దరు చీర కట్టుకొని బయటకు వచ్చింది. ఇంటిమీద కాంగ్రెసు జెండా ఎగరవేసింది. అమ్మలక్కలు అందరూ నవ్వులు కొరుక్కున్నారు. కాని, ఎవ్వరూ ఆమెను ఇదేమిటని అడగలేదు.

కాని, రంగయ్యమాత్రం రాజయ్య గారు హెచ్చరించారు — "గొర్రె కొండను ఢీకొంటుందిరా? ఫలితం తెలిసిందేగా?" అని. రంగయ్య భార్యకు రాజయ్యగారు చెప్పింది ముద్దుగా చెప్పాడు.

పిలిచి వెళుతున్న రాజయ్య గారిని మరుసటి రోజున సుభద్రమ్మ నిలదీసి అడిగింది. రాజయ్యగారు నీళ్ళు నములుతూ, "అది కాదమ్మా! ఇప్పుడు తెల్ల దొరల పరిపాలనలో మన కొచ్చిన కష్టం ఏమిటమ్మా? చక్కగా వాళ్ళు మన దేశాన్ని ఎంతగానో అభివృద్ధి చేస్తున్నారు. వాళ్ళ పరిపాలనలో తిండికి, గుడ్డకు లోటు ఏమీ లేదు గదా? మోటారుకార్లు, రైళ్ళు, ట్రాములు, అబ్బో! ఎన్ని ప్రయాణ సౌకర్యాలు కలిగిస్తున్నారో! ఎన్ని మేడలు! ఎన్ని మేళ్ళు చేస్తున్నారు! ఇవన్నీ చేయటానికి మనవాళ్ళకి ఎక్కడి దమ్మా తెలివి తేటలు? కృష్ణ మీద ఆనకట్ట కట్టాలంటే మనవాళ్ళ వల్ల అవుతుందా? ఏనుగు రోడ్లో వెళుతూ ఉంటే కుక్కలు మొరుగుతాయి. అందువల్ల, ఏనుగుకు గౌరవం తగ్గుతుందా, అమ్మా? మీరు ఎన్ని ఉద్యమాలు నడిపినా, దొరల పరిపాలన మనకు తప్పదమ్మా. అది బ్రహ్మ మన నుదుట రాశాడు" అంటూ వేదవాక్కులు చెప్పారు.

దానితో సుభద్రమ్మగారు భద్రకాళిలా రెచ్చిపోయి, "దొరలు మనకు చేస్తున్నవి మేళ్ళు కావు. ఒకవేళ చేస్తున్నా అవి వాళ్ళ స్వార్థంకోసమే. వాళ్ళు మనలను పాలిస్తున్నది వాళ్ళ లాభంకోసమే నండి. వాళ్ళు పొదుగు కోసి పాలు తాగినట్లు వ్యవహరిస్తున్నారు. రౌతు గుఱ్ఱాన్ని ఎలా లొంగదీసుకొంటున్నాడో అలాగే మనలను బానిసలుగా చూస్తున్నారు. మీరు చెప్పేది చూస్తుంటే మన ఇంటిని చక్కబెట్టు కోవటానికి పరులకో అధికారమిచ్చి చూడమన్నట్టుంది. మన దేశాన్ని మనం

వంచన

అమ్మాయీ, నీవు నీ సర్వస్వం అతనికే అర్పించానని చెప్పావా? అతడు నిన్ను అపూర్వంగా, అనంతంగా ప్రేమిస్తున్నానని అన్నాడా? ఇద్దరిలో ఎవరో అబద్ధం ఆడుతున్నారని అర్థం.

—డొరొతి పార్కర్

పాలించుకోలేమటండీ? బానిసలుగా భోగాలు అనుభవిస్తూ ఒకరికి అణగి పడి ఉండే బదులు చనిపోవటం మేలు. కాకిలా చిరకాలం బ్రతికి ఏం ప్రయోజనం? కోకిలలా నాలుగు రోజులు బ్రతికితే చాలు" అంటూ ఎదురు తిరిగి సమాధానం చెప్పింది.

"అవునమ్మా. బ్రహ్మంగారు కాలజ్ఞానంలో రాయనే రాశారు. ఆడవాళ్ళు రోడ్లెక్కి ఉపన్యాసాలిస్తారని ఎప్పుడో అనుకొన్నా" అని వ్యంగ్యంగా అంటూ విసవిసా వెళ్ళిపోయాడు.

ఈ పరిస్థితుల్లో కొంచెం కాంగ్రెసు వాసన మాల పల్లెను సోకింది. అందునా నరసిగాణ్ణి మరీ ఆకట్టుకొంది. కోటిగాడి కొడుకు నరసిగాడు పద్దెనిమిది ఏళ్ళ వాడైనా, పడ్డ బస్తాను తేలిగ్గా లేపే వాడు. వయసుకు మించిన శరీరం. చూడటానికి వస్తాదు లాగ ఉండేవాడు.

'మాలమాత్రం మనుషులు కారా
మాలలు కోసిన రక్తం రాదా?
నీలో ఉన్నది పాలా? ...'

ఇలాంటి పాటలు ఆ మాల పల్లెను, అందులో నరసిగాడి వెంట రోజూ రావడం ఆరంభమయింది. ఇక వాడికి కూలి పనుల మీంచి మనసు మళ్ళింది. ఎప్పటి కప్పుడు పక్కనున్న పట్నం పోయి, కాంగ్రెసు వారి వ్యవహారాలన్నీ తెలుసు కొనే వాడు. ఆ కార్యకలాపాల్లో పాల్గొనా లనే కోర్కె వాడికి బలంగా కలిగింది. కాంగ్రెసు వారు చేసే ప్రతి పనిలోనూ ముందుకు దూసుకుపోయి దేశంకోసం పాటుపడాలని వాడి మనస్సులో తీవ్రంగా నాటుకుపోయింది.

ఆ రోజు కోనేటి గట్టుమీద జెండా కట్టాలని కాంగ్రెసు వాళ్ళు నిర్ణయించుకొన్నారు. అనుకొన్న ప్రకారం కాంగ్రెస్ వాలంటీర్లు జెండాలు పుచ్చుకొని 'వందే మాతరం', 'మహాత్మా గాంధీకి జై' అంటూ బయలుదేరారు. ఈ విషయం తెలుసుకున్న నరసిగాడు ఊరేగింపులో చేరాడు. పోలీసులకు ఈ విషయం ఎలా తెలిసిందో తెలిసింది. గట్టు మీద జెండా కట్టకుండా ఉండేందుకు పోలీసులు విపరీతంగా లాఠీఛార్జి చేశారు. వాలంటీర్లంతా జెండాలు విడిచి పెట్టి గుంపులోనుండి చెదిరిన పక్షుల్లా పారిపోయారు. నరసిగాడు మటుకు మిగిలాడు. వాడిలో దేశభక్తి పెల్లుబికింది. చుట్టూ ఒక్క క్షణం చూశాడు. అంతే. మరుక్షణంలో జెండా చేతబుచ్చుకుని తుపానులా ముందుకు వస్తున్న పోలీసుల మధ్య నుండి బాణంలా శరవేగంగా దూసుకు వెళ్ళాడు. ఎన్ని దెబ్బలు తిన్నాడో లెక్కలేదు కాని, కోనేటి గట్టుమీది కెక్కి జెండా కట్టి కుప్పలా రక్తపు మడుగులో 'వందేమాతరం!' అంటూ కూలిపోయాడు. ఆ దెబ్బలనుండి కోలుకోవడానికి దాదాపు నెల రోజులు పట్టింది.

దెబ్బలు మానిన తరవాత గుంటూరులో మళ్ళా ఎవరిదో మీటింగంటే వెళ్ళాడు. అక్కడ లాఠీఛార్జి. ఆస్పత్రిలో పదిహేను రోజు లుండి ఇంటికి చేరాడు.

గాంధీగారి మద్యపాన నిషేధ ఉద్యమం వల్ల ఉత్తేజితులైన వాలంటీర్లు కల్లు దుకాణాల వద్ద పికెటింగు చేయనున్నట్లు తెలుసుకొని ముక్కుతూ, మూలుగుతూ అక్కడకు వెళ్ళి కల్లు అమ్మే వాళ్ళని అమ్మవద్దని బ్రతిమాలాడు. లాభం లేకపోవటంతో కల్లు ముంతలను పగల కొట్టాడు. కల్లు అమ్మే వాళ్ళు నరసిగాడి తల పగలకొట్టారు.

ఒక సంవత్సరంలో నరసిగాడిలో మానసికంగా దృఢత్వం వచ్చినా, శారీరకంగా బలహీను డయ్యాడు. తాను చేసిన ఘనకార్యాలు గురించి నెమరువేసుకోవటం వలన ఒక నిర్ణయానికి వచ్చాడు నరసిగాడు. తన ఆరోగ్యం బాగుపడగానే శాయశక్తులా దేశానికి పాటుపడాలను కొన్నాడు.

అలా అనుకొని ప్రతి కాంగ్రెసు ఉద్యమంలోను పాల్గొనసాగాడు. విదేశీ వస్త్ర బహిష్కరణ, క్విట్ ఇండియా, ఉప్పు సత్యాగ్రహం...ఒక్కటేమిటి గాంధీగారు ఆరంభించిన ప్రతి ఉద్యమంలోను పాల్గొంటూ ఆయన ఆశయాలను, ఆదేశాలను, సిద్ధాంతాలను మనసా వాచా ఆచరించసాగాడు.

ఇలా అయిదేళ్ళు గడిచాయి. దేశంలోను, పల్లెల్లోను చాలా మార్పులు వచ్చాయి! 'దున్నే వాడిదే భూమి' అనే నినాదంతో మాలపల్లెలను కమ్యూనిస్టులు ఆకర్షించసాగారు. ఊర్లో రైతులు గోడమీద పిల్లి వాటంగా, జమీందారులను కాదనక, ఒక వేళ కాంగ్రెసు వాళ్ళు స్వరాజ్యం సంపాదించి దేశాన్ని ఏలితే ఇబ్బంది పడకుండా ఉండేటట్లు ప్రవర్తించసాగారు. దీనివల్ల నరసిగాడిని కొంతమంది బలపరిచినా మాలపల్లె మొత్తం ఎదురు తిరిగింది. అయినా, లెక్కచేయకుండా కాంగ్రెసువారి పనుల్లో ముమ్మరంగా పనిచేయసాగాడు.

ఇంతలో 1947 వ సంవత్సరం రానే వచ్చింది. ఆ రోజు ఆగష్టు 15. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. తెల్ల దొరలు ఈ దేశం విడిచి పోతున్నట్లు, మన నాయకులే పరిపాలించబోతున్నట్లు తెలుసుకొన్నాడు. ఆ నాడు వాడికి హిమాలయ పర్వతం ఎక్కినంత ఆనందం కలిగింది. పెద్ద జెండా భుజాన వేసుకొని 'గాంధీగారికి జై' అంటూ ఊరంతా తిరిగాడు. ఏవో ఎవరికి వివరించి చెప్పలేని భావాలు. మనసంతా ఉద్వేగం. ఒక విధమైన ఆనందంతోను, ఉద్రేకంతోను అతని మనసు ఉగిసలాడింది. ఏదో చేయాలి. ఇంకా ఏదో సాధించాలని అతని మనస్సు ఆరాటపడింది. ఆ రోజు రొమ్ము విరుచుకొని మాలపల్లె అంతా తిరిగాడు. మధ్యాహ్నానికి తాటిచెట్టు దగ్గరకు వచ్చి, అక్కడ జెండా కట్టి, తృప్తి తీరా నిట్టూర్చి, చెట్టుక్రింద కూర్చుని, అలసట తీర్చుకుని మరీ ఇంటికి వెళ్ళాడు.

ఆ అయిదు సంవత్సరాలలో దాదాపు పదిసార్లు అరెస్టై పోలీసు స్టేషనుకి వెళ్ళి దెబ్బలు తిన్నాడు. అప్పుడల్లా, ఆ విధంగా దెబ్బలు తిన్న వాళ్ళు, జైలులో ప్రతిసారి అయిదేసి, పదేసి రోజులు చొప్పున ఉన్న వాళ్ళు ఆ తాలూకాలో

ఎవరికీ లేదు. వరిసిగాడంటే అభిమానం లేకపోయినా కొన్నిపాళ్ళకే ఉపయోగపడతాడని అందరూ అతన్ని మందహాసంతో పలకరించి అభినందించారు.

ఆ రోజు రాత్రి అనేకుల త్యాగాల వల్లను, ప్రాణార్పణల వల్లను సాధించిన ఈ స్వాతంత్ర్యాన్ని ఎవరయినా అపహరిస్తారేమోనని భయం కలిగింది. 'లేదు. అలా జరగటానికి వీల్లేదు. మన స్వాతంత్ర్యాన్ని ఎవ్వరూ లాక్కోవటానికి వీల్లేదు. పరాయి వాళ్ళు మన దేశంలో సూది మేర స్థలాన్నయినా ఆక్రమించడానికి వీల్లేదు. స్వాతంత్ర్యం సంపాదించటం కన్న దాన్ని ఎల్లప్పుడూ రక్షించుకోవటం పెద్ద సమస్య' అనుకొన్నాడు. అంతలో వాడికి ఒక ఆలోచన తట్టింది.

దేశరక్షణకై అహర్నిశలు పాటుపడే మిలిటరీలో చేరిపోవా లనుకొన్నాడు. మర్నాడే పట్నం వెళ్ళి కొత్త ఊరు వరవయ్యగా మిలిటరీలో చేరాడు. వరవయ్య మిలిటరీలో భక్తిశ్రద్ధలతో స్వాతంత్ర్యాన్ని కాపాడే నిమిత్తం దేశ రక్షణకు సరిహద్దు ప్రాంతాల్లో రేయింబవళ్ళు కష్టపడ్డాడు. పై అధికారుల ఆజ్ఞలను తు. చ. తప్పకుండా పాటించే వాడు. మిలిటరీలో ఉన్నవాళ్ళు తాగుడు మొదలైన దురలవాట్లకు అందరివలె లొంగలేదు. తోటి సైనికులైన భాటియా, రావు మొదలైన వారు తాగమని, తాగకపోతే ఉత్సాహం రాదని, చలికి తట్టుకోలేమని, ఉండే నాలుగు రోజులు అనుభవించాలని బలవంతం చేసినా, అది గాంధీ గారి సిద్ధాంతాలకు వ్యతిరేకమని వాదించే వాడు. తాగకపోతే చలి కాగలేమని చెప్పే మాటలు కుంటిసాకు లనేవాడు. మనోధైర్యం, చిత్తశుద్ధి, పట్టుదల ఉంటే అగ్నిలోనైనా దూకవచ్చు ననే వాడు. అతన్ని ఒట్టి చాదస్తుడని, అమాయకుడని అతని వెనక తోటి సిపాయిలు హేళన చేసేవారు. పాకిస్తాన్‌తోను, చైనాతోను వచ్చిన యుద్ధాలలో దేశాన్ని రక్షించడానికి ప్రాణాలనైనా లెక్కచేయక పోరాడాడు.

ఇరవై అయిదు సంవత్సరాల తరవాత మిలిటరీ నుండి వచ్చి స్వంత ఊరైన కొత్త ఊరుకు బయలుదేరాడు. దారిలో దేశ పరిస్థితుల గురించి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రయాణికుల వల్ల విన్నాడు. దేశంలో కలిగిన మార్పులు స్వయంగా చూశాడు. ఎన్నో కర్మాగారాలు వెలిశాయి. దేశం ఎన్నో రంగాల్లో అభివృద్ధి చెందింది. దానితోపాటు పదింతలు వేయింతలుగా స్వార్థపరత్వం, అవినీతి, లంచగొండితనం పెరిగిపోయాయి. విద్యావంతులు పెరిగారు. దానితోపాటు నిరుద్యోగ సమస్య అభివృద్ధి చెందినది. గ్రామాలు విద్యుద్దీపాలతో కళకళలాడుతున్నా ప్రజల్లో జీవకళ నశించింది. ఎక్కడ చూసినా అసంతృప్తి, ఆందోళనలు, కల్లోలాలు. ప్రజల జీవనంలో ప్రశాంతత మృగ్యమైపోయింది. ఆ నాడు నాయకులు నిస్స్వార్థంగా స్వాతంత్ర్య సంపాదనకోసం ఎన్నో త్యాగాలు చేశారు. నేడు సోషలిజం పేరుతో ప్రజలను మోసగిస్తూ పదవులకోసం, పార్టీలను, చివరకు సిద్ధాంతాలను ఏ ఎండకు ఆ గొడుగు పట్టే రీతిగా మార్చుకొంటూ నాయకులు చేయరాని అక్రమాలు చేస్తూ ఉవరవిల్లి జీవితం గడుపుతున్నారు. నాగరికత పెరిగింది. దానితోపాటు అరాచకత్వం పెరిగింది. నైతిక విలువలు దిగజారుతున్నాయి. ఆ రోజుల్లో విదేశ వస్తువులను బహిష్కరించాలని, స్వదేశీ వస్తువులే ఉపయోగించాలని శపథం చేసిన నాయకులు, ఆ నాయకుల అనుయాయులు విదేశీ వస్తువులపై మోజుపడుతున్నారు. విదేశీయులను అనుకరించటం అధికమైపోయింది. ధరలు పెరిగిపోతున్నాయి. ప్రజల్లో నిరాశ, నిస్పృహలు. దేశంలో ఎక్కడ చూసినా సమ్మెలు, ఘెరావోలు.

ఆ నాడు స్వాతంత్ర్యం సంపాదించిన తరవాత దేశాన్ని సుభిక్షం చెయ్యాలని, సామాన్యుని జీవనం సుఖ శాంతులతో తులతూగేటట్లు చేయాలని, దేశం పాడి పంటలతో, పచ్చలతో కళకళలాడేటట్లు చేయాలని, సర్వతోముఖంగా అభివృద్ధి చెందిన భారతదేశాన్ని ముందుకు నడిపించాలని ఆ నాడు అనేకులు అనుకొన్నారు. మహనీయులు, దేశభక్తుల త్యాగంవలన సాధించిన స్వాతంత్ర్య ఫలం ఇదేనా? ఆ నాడు మేము కనిన కలలన్ని కల్లలేనా? అని వాపోయాడు.

ప్రజలను, వారి స్వభావాలను గమనించి మిలిటరీలో ఉన్నప్పుడు భారతదేశం అభివృద్ధికి, నేడు తను కనులారా చూస్తున్న యథార్థాలకు అంతనా పొంతనా దొరక్కపోవడంతో వరవయ్య కళ్ళు గిర్రున తిరిగాయి.

వరవయ్య ఆ రోజు రాత్రి కొత్త ఊరు చేరాడు. మన దేశ భవిష్యత్తు లాగానే ఆ గ్రామం అంధకారంలో మునిగిపోయింది.

కుక్కలు భౌ భౌమని మొరగ సాగాయి.


# వ్యక్తిత్వానికి దీటైన పెన్నులు!


కేమ్లిన్

స్కెచ్ పెన్నులు & ఫైరైట్ పెన్నులు.

గుర్తుంచుకొనవలసిన అంశములు:

- స్కెచ్ పెన్నులు 12 రంగులలో లభిస్తున్నవి: ఫైరైట్ పెన్నులు 7 రంగులలో లభిస్తున్నవి.
- సిరాతో నింపటానికి వెనుక ప్లగ్ తీసి వేయుము.
- టిప్ పూర్తిగా పొడి ఆరిన వెంటనే రిఫిల్ ఇంకును ఉంచండి.
- ఫైరైట్ ఒక గట్టి సింథటిక్ టిప్ కలిగియుండును. అది వంగదు.
- స్కెచ్ పెన్నుల కొఱకు టిప్ సింథటిక్ రెసిన్-బ్రిటిష్ ఫైబర్‌తో తయారు చేయబడినది. అందువలన చిత్రీకరించునపుడు లోపల ఒత్తిడి శక్తి బయటకు రాలదు.
- ఫైరైట్ & స్కెచ్ పెన్నులకు ప్రత్యేకముగా అన్ని రంగులలో రిఫిల్ ఇంకులు లభిస్తున్నవి.


FIRITE ఫైరైట్ 923




స్కెచ్ పెన్ 921

కేమ్లిన్ ప్రై. లి.
ఆర్ట్ మెటీరియల్ డివిజన్,
జె.బి. నగర్, బొంబాయి-59
ఇండియా.

PRATIBHA 1215-52-TEL R




ఊరు మధ్యలో ఉన్న రావి చెట్టు ఎప్పటిలాగా అతన్ని ఆహ్వానించింది. నరసయ్య హృదయం ఉప్పొంగింది. దేశం మారినా, ప్రజలు మారినా రావిచెట్టు మటుకు మారకపోవటం అతనికి చాలా ఆనందం కలిగించింది. నేలలో బలంగా పాతుకుపోయిన దాని ఊడలుచూస్తుంటే నరసయ్యకు ప్రజలలో పాతుకుపోయిన స్వార్థపరత్వం జ్ఞప్తికి వచ్చింది. ఈ స్థితిలో గాంధీ బ్రతికి ఉండి దేశం ఎదుర్కొంటున్న సమస్యలను, నాయకుల తీరుతెన్నులను, ప్రజల పరిస్థితులను చూస్తే ..

ఇంక ఆపైన ఆలోచించలేక పోయాడు. ఆ రోజులలో చేసిన ప్రమాణాలు వమ్ము అయిపోయాయే అని, ఆచరణలో పెట్టలేకపోయారే అని అసలు ఆ సిద్ధాంతాలను మరిచిపోయిన నాయకుల గురించి ఆలోచిస్తూ ఆ రాత్రి చాలాసేపటిదాకా నిద్ర పోలేదు.

తెల్లవారుజామున కొంచెం కునుకు పట్టింది. తెల్లవారింది. సూర్య భగవానుడు తన లేత కిరణాలతో అందరిని ముద్దాడసాగాడు. ప్రజలు ఎవరి పనుల్లోకి వాళ్ళు బయలుదేరి వెళ్ళసాగారు. అయినా, నరసయ్యకు మెలుకువ రాలేదు. ఎవరో సిపాయి రావిచెట్టు క్రింద పడుకొన్నాడని ఊరంతా పాకిపోయింది. పిల్లలు బడికి పోతూ, వింతగా సిపాయి దొరలా ఉన్న నరసయ్యను చూస్తూ వాళ్ళలో వాళ్ళు నవ్వుకొంటూ, కేరింతలాడుతూ అతని చుట్టూతా నిలబడ్డారు. ఆ కలకలంతో నరసయ్యకు మెలకువ వచ్చింది. ఆ దారిన పొలం నుంచి వస్తున్న పెద్ద మనుషులు పిల్లలను చూచి, "ఎందుకురా అలా నవ్వుతున్నారు! ఇక్కడ ఏమైనా కోతికొమ్మచ్చులు ఆడుతున్నాయా? అయినా, పిల్లలు బడికి పోయి శ్రద్ధగా చదువుకోవటంపోయింది. అల్లరి ఎక్కువవుతున్నది. మీ మాస్టారుతో చెబుతాను. ఉండండి" అంటూ గదమాయిస్తూ ఆ పక్కనే వాళ్ళని చూచి లేచి కూర్చున్న నరసయ్యను చూచి ఎవరా అని ఆలోచిస్తూ, "ఏ ఊరు, బాబూ?" అని అడిగారు.

"ఈ ఊరేనండీ" అని ఎంతో ఉత్సాహంతోను, గర్వంతోను జవాబిచ్చాడు.

"ఈ ఊరా?" వారిలో ఆశ్చర్యం.

"అవును. నా పేరు నరసయ్య. మా నాయన కోటయ్య. నేను ఇరవై అయిదేళ్ళ క్రిందట మిలిటరీలో చేరాను. మాది మాలపల్లె లెండి" అన్నాడు.

"ఓ! కోటిగాడి కొడుకువా? కోటిగాడు చనిపోయి అయిదేళ్ళు అయిందే? పాపం, నీకోసం తెగ కలవరించాడురా చివరి రోజుల్లో — నీకు తెలియదా?"

"తెలియదండి" అని నిర్లిప్తంగా జవాబిచ్చాడు నరసయ్య.

అప్పుడే పేపరు చదువుతూ వస్తున్న ఛెయిర్మన్ అయిన రామబ్రహ్మం గారి కొడుకు పరంధామయ్య "ఒరేయ్, నూరయ్యా! ఈ విషయం విన్నావా? మన ఊళ్ళోని సుభద్రమ్మ గారికి తామ్రపత్రం వచ్చింది" అన్నాడు.

"అంటే ఏమిటండీ?" అన్నాడు ఒక మోతుబరి.

"అంటే దేశంకోసం త్యాగం చేసిన దేశభక్తులను గౌరవిస్తూ చేసే సన్మానమన్న మాట" అని వివరిస్తూ కొత్త మనిషి అయిన నరసయ్య వంక ఎవరని ప్రశ్నార్థకంగా చూశాడు.

"వీడు మాలపల్లి కోటిగాడు — ఆవేనండీ, అయిదేళ్ళ క్రిందట పొలంలో పాము కరిచి చచ్చిపోయిన మాల కోటిగాడి కొడుకు నరిసిగాడండీ."

"అయ్యో, మన పెద్దోళ్ళు అంటుండేవారు గదండీ, కోనేటి గట్టు మీద జెండా కట్టిన ఆ నరిసిగాడు వీడేనండి! మిలిటరీలో ఉన్నాడట" అని ఒకడు సమాధాన మిచ్చాడు.

"అలాగా? సరేలే! తామ్రపత్రం మన ఊరుకు చెందిన దేశభక్తురాలైన సుభద్రమ్మ గారి కొచ్చిందిగా? మనం మన ఊరి తరఫున ఆమెకు సన్మానం చేస్తే బాగుంటుంది. దానికి తగిన ఏర్పాట్లన్నీ మనందరం కలిసి చెయ్యాలి. ఇది మనందరి పండగ. అందువల్ల ఒరేయ్, నూరయ్యా! తొందరగా నువ్వు పంచాయతీ ఆఫీసుకు వచ్చెయ్. అక్కడ మీటింగు వగైరా, వగైరాలకు ఏర్పాట్లు చూడాలి. మీరంతా సాయంకాలం రండేం! ఇంకా ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి" అంటూ హడావిడిగా నరసయ్యను పలకరించకుండా వెళ్ళిపోయాడు ఆ ఊరి ఛెయిర్మన్.

సుభద్రమ్మగారిని చూడాలనిపించి, "బాబూ! సుభద్రమ్మగారిల్లెక్కడ?" అని దారినిపోయే ఒకతన్నడిగాడు. "ఏం? ఆవిడను చూడాలా? ఆ కనిపించే నాలు గంతస్తుల మేడే ఆవిడ ఇల్లు" అని చెప్పి తన దారిని వెళ్ళిపోయాడతడు.

ఆ మేడ చూడగానే నరసయ్య బుర్ర గిర్రున తిరిగిపోయింది.

వెంటనే బ్రాంది షాపుకి వెళ్ళి ఒక బాటిలు కొనుక్కుని, రావిచెట్టు క్రింద కూర్చుని, ఇలాంటి ప్రజలకోసం, దేశం కోసమా నేను నా ప్రతి క్షణాన్ని, ప్రతి రక్తపు బొట్టును, నా జీవితాన్ని వెచ్చించింది అనుకొని గటగటా తాగుతూ —

"జగమే మాయ
"జగమే మా
జగమే
జగ
జ ... ..."

అంటూ మత్తులో మునిగిపోయాడు.

సాయంత్రం సుభద్రమ్మ గారిని సన్మానించటానికి పెద్ద ఊరేగింపు బయలుదేరింది. రామబ్రహ్మంగారు, రాజయ్యగారు, ఛెయిర్మన్‌గారు, నల్ల కళ్ళజోడు వేసుకున్న సుభద్రమ్మగారు పూలరథంలా అలంకరించబడిన పెద్ద కారులో కూర్చుని వస్తుంటే, ఊరులోని రైతులు, ధనవంతులు తాగిన మైకంలో జెండాలు తిరగేసి పట్టుకొని, మరికొందరు జెండాలు లేకుండా ఉత్త కర్రలు పట్టుకొని జేజేలు పలుకుతూ కోలాహలంగా రాసాగారు.

సుభద్రమ్మగారు మొదలైన వారు చిరు మందహాసాలతో ప్రజలకు నమస్కరిస్తూ, ఊరేగింపుకి అలంకారప్రాయంగా కనిపించసాగారు. ప్రజలందరు "మహాత్మా గాంధీకి జై", "ఇందిరా గాంధీకి జై", "సుభద్రమ్మగారికి జై" అని నినాదాలు చేస్తూ ఉంటే ఊరేగింపు మెల్ల మెల్లగా కదిలి రాసాగింది.

విస్కీ మత్తులో కూరుకుపోయిన నరసయ్య దూరాన వినబడుతూన్న నినాదాల్ని విని తానుకూడా "గాంధీగారికి జై" అన్నాడు. కాని, మరల తాగిన నోటితో పవిత్రుడైన గాంధీ పేరు ఉచ్చరించకూడదు అనుకొని "బ్రాందికి జై" అన్నాడు.

"తప్పు, తప్పు, గాంధీ గారికి జై
నో, నో, బ్రాందికే జై
కానే కాదు! గాంధీగారికే జై!
కాదు కాదు. గాంధీకి, బ్రాందికి
రెండింటికి జై! జై!" అంటూ పిచ్చిగా గొణుక్కోసాగాడు నరసయ్య.

ఊరేగింపు నెమ్మదిగా రావిచెట్టు దగ్గరికి వచ్చింది. రావిచెట్టు క్రింద కూర్చున్న నరసయ్యను చూడగానే సుభద్రమ్మగారు గతుక్కుమన్నారు. ఆమె శరీరం ఆమెకు తెలియకుండానే కుంచించుకుపోసాగింది. ఆమెలో ఒక విధమైన భీతి. సుభద్రమ్మ గారు తనలో తాను గొణుక్కోసాగారు. సుభద్రమ్మగారు గొణుక్కుంటున్నది, నరసయ్య పిచ్చి వాగుడు ఊరేగింపు ప్రజలు చేస్తున్న జయ జయ ధ్వానాలలో కలిసి, ఎవరికీ కనిపించని అనంతంలో విలీనమయిపోయాయి. ★